# స్వార్థపరులు

మూర్తిగారికి డబ్బు సంపాదించే విధం బాగాతెలుసును. దానిని పెంచి పెరిగించడం కూడ అంతకన్న బాగా తెలుసును. దమ్మిడీవృధాగా పోనివ్వడు. ఈయన కొంచం పొదుపుగా పోవడం బట్టి లోకమంతా ఈయన్ని లోభి అంటారు. తనకోసం గాని, తన కుటుంబం కోసంగాని ఏ ఖర్చువచ్చినా అవసరమయితే వెనుదీయడు. ఒకళ్ళకు మాత్రం తేరగా ఖర్చుపెట్టి నష్టపోవడానికి ససేమిరా ఒప్పుకోడు. ఎవళ్ళుమాత్రం ఒప్పుకుంటారు? తను సంపాదించి ఒకళ్ళకి ఉత్తిపుణ్యానికి వినియోగించమంటే ధర్మమా? అతను సంసారవిషయంలో ఏ విధమయిన లోటూ చెయ్యడు. లక్ష్మీదేవిని హారతిపట్టి ఆహ్వానిస్తాడు. వచ్చిన తర్వాత తిరిగి వెళ్ళకుండా చీపురు పట్టుకు నిలబడతాడు. అతనికి సంపాదించుకొనే శక్తి, ఉపాయం వుంది. ఆయనమీద చేతకాని వాళ్ళందరూ ఏడవడం ఎందుకు?

ఈయన ప్రతి విషయంలోనూ ఎంత తక్కువచూపు చూడాలో అంతవరకూ చూసి అంత తక్కువలోనే జరుపుతాడు. తన కుటుంబం విషయం తప్పిస్తే. అనగా సంబంధించిన వాళ్ళందరూ కాదు— తను తన భార్యపిల్లలూ ఇంతే. వీళ్ళని తప్పిస్తే తతిమ్మా ఎంత దగ్గర బంధువు లయినా ఆఖరికి అల్లునికయినా అలాగే చేస్తాడు. అది అయన స్వభావం. తాను తెచ్చుకున్న డబ్బుతో ఎంతలాగయినా సుఖపెడతాడు, సమ్మతిస్తాడు, కాని మరొకవ్యక్తికి దానివల్ల ఫలం పొందడానికి ఏమీ హక్కు లేదని ఆయన భావం. అందుకే ఆయనకి డబ్బు ఖాతరు లేకపోయినా,

అందరూ నానామాటలు అంటున్నా, ఒకరికి ఖర్చుపెట్టవలసే సమయం వచ్చేసరికి మాత్రం తీవ్రంగా ఆలోచించి క్షణంలో తేల్చేయ చూస్తాడు. అలా చేయడానికి అనుకూల వాతావరణం ఏర్పరచడంలోనూ ఎవరికైనా నచ్చచెప్పి తన మాటమీద నడిచేట్టు చేయడంలోనూ అతని కతనే సాటి.

ఇతనుచేసే పనులూ, మాటాడే విధం, నడత అంతా ఈ సిద్ధాంతం మీదే ఆధారపడి వుంటాయి. ఇతనితో సంబంధం పెట్టుకున్నవాళ్ళూ, స్నేహం చేసేవాళ్ళు అంతో ఇంతో ఇలాటి గుణాలు కలవాళ్ళే అయి వుంటారు.

ఇతనికి మరే విషయంలోనూగానీ, మరెవరి వల్లనూగాని ఇబ్బంది ఏర్పడలేదుగాని ఒక్క అల్లుడి మూలంగా మాత్రం కొన్ని కొన్ని అనుకున్నవి అనుకున్నట్టు జరగడంలేదు. అక్కడికీ చదరంగపు ఎత్తులు వేస్తూనే వుంటాడు. అయినా తన చెయ్యి కింద అవడంవల్ల అల్లునిచెయ్యి మీదవుతూ వుంటుంది. మరి ఆ అల్లుడికి డబ్బురాబట్టే సూత్రాలు ఇంకా ఎంతబాగా తెలుసో! అందులోనూ కష్టపడకుండా ధనలక్ష్మిని వరించడం సామాన్యుడికి సాధ్యమా! అది అల్లుడికి మావగారిద్వారా సాధ్యం! ఎంతలాటివాడికయినా ఆ కిటుకు కనిపెట్టి, ఆయువుపట్టు నొక్కేవాడు ఎవడో ఒకడు ఎప్పుడో ఒకప్పుడు తటస్థపడుతూనే వుంటాడు.

మూర్తిగారికి ఒక్క దురాలోచన మాత్రం వుంది. అదేమిటంటే—తనకంటే ఎవడూ ఆధిక్యంగా వుండకూడదు. నలుగురిలోనూ అందరికంటే తనే గొప్పవాడిగా కనిపించాలి. ఎవడినైనా తన అడుగుజాడల్లో తు-చ- తప్పకుండా ఎంతంటేఅంతేలా నడిచేట్టుచెయ్యాలి. సర్వాధికారం తనదేనని అనిపించుకోవాలి. ఇదీ యీయన వాంఛ. ఈ కోర్కె వుంటే అది తామరలాగ ప్రాకి అడితే అలిగే అల్లుళ్ళ మీదికి కూడా పోవడం ఆయనకి సహజం. కాని వాళ్ళకి కూడా యీ తరహా ఇష్టపడకపోగా ఏ విధంగానైనా ఈయన్నే లొంగేట్టు చేసుకోవాలనే భావంకూడ కలగడం భావ్యం.

ఈయనకి సంబంధించిన అల్లుడు సర్వవిధాలా ఈయనికి తగును. వ్యక్తిగతంగా ఆలోచిస్తే మూర్తిగారి భావాలూ, గుణాలు, స్వభావాలూ, ఆ

అల్లుని తత్వమూ అక్షరాలా ఒకటే. యీయన మరొక విధంగా డబ్బు లాగజూస్తే యీయన అల్లుడు యీయన ద్వారానే లాగజూస్తాడు. ఆ యుకులూ, ఆ యమకాలూ, ఆ కిటుకులూ, ఉపాయాలూ, న్యాయంగా ఒకటే. కాని, అన్ని విషయాల్లోనూ సమానమైన వారున్నారంటే వారిద్దరికి వైషమ్యం వుండి పొత్తు కుదరకపోవడం సర్వసామాన్యం. అందువల్లనే మూర్తిగారిమీద అల్లుడూ, అల్లునిమీద మూర్తిగారూ రాజకీయపు ఎత్తులు వేసుకుంటూ వుంటారు.

ఈ అల్లుడు యీ సందర్భంలో డబ్బు రాబట్టవచ్చు అని తోస్తే గుంజేశాడన్నమాటే. ఎందరుచెప్పినా వినడు. అది అక్రమం అయినా, అధర్మం అయినా, సబబయినా కాకపోయినా, తనపని తాను చేసి తీరాడన్నమాటే. ఉల్ఫాగా ధనార్జనకోసంకనిపెట్టుకు కూర్చుంటాడు.ఉల్ఫాగా రాబట్టాలంటే అల్లుళ్ళకి మావగార్ల కన్నా వేరే దిక్కెవరున్నారు? అందుకే యీతడు మామగారైన మూర్తిగారిమీద పట్టించాడు.

మొహం ముందు అతి లౌక్యంగా మాటాడుకుంటారు! ఎందుకలా చేసేవని ఆయన అనడు. నువ్వెందుకలా చేసేవని యీయనా అనడు. ఒక వ్యాపారంలాగ అది జరుగుతూవుంటుంది. మూర్తిగారికి డబ్బు సంపాదన విషయంలో అల్లుడూ సలహా ఇస్తుంటాడు. ఆయన యీయనకి గుట్లు చెబుతూవుంటాడు, తనమీద ఆధిక్యతచూపదలుచుకునే మావగారి వాంఛని యీయన ఏ మాత్రం జరగనివ్వడు. అటువంటి సందర్భాలువస్తే ఇద్దరూ అతి లావణ్యంగా తప్పించుకొని ప్రత్యేక వ్యక్తుల్లా వుంటారు. అందుకే ఒకరినిమించి ఒకరు అవడంవలన నలుగురిముందు ఒకరినొకరు ప్రశ్నించుకోవడం మానుకున్నారు. ఇక ఏకాంతంగా ఇద్దరూ మాటాడుకొనేటప్పుడు ఏ అరమరికలూ ఉండవు. ఎవరి అంతస్తులో వారుంటారు.

ఈ స్వభావాలే కాకుండా, ఒకరినొకరు దెబ్బకి దెబ్బ కొట్టజూచి ఎలాగయినా లొంగదీసుకోవాలని చూచే యీ బుద్ధీ కలగడానికి వేరే కారణం కూడా వుంది.

ఈ అల్లుణ్ణి చేసుకోవాలని మూర్తిగారికి మొదటలో లేదు. అంటే

అయిష్టతగాని మరే కారణంగాని లేదు. కాని ఇతనిపై దృష్టిలేదు. ఎవడయినా ఇంకా ఎక్కువ చదివినవాడిని చేద్దాం అని అనుకున్నాడు. కాని మూర్తిగారి భార్యాపట్టుదల ఇతనివైపు మ్రొగ్గగా తప్పిందికాదు. రెండోది: డబ్బు పిసినారి తనమయినా మరేదైనా కట్నం ఇవ్వడం యీతనికి ఇష్టం లేదు. అదెలాగైనా తప్పించాలని కొసవరకూ ప్రయత్నించేడు కాని మిగతా పెళ్ళికొడుకులతో పోల్చిచూస్తే తక్కువ కట్నంతో యీ అభాగ్యుడే కనబడ్డాడు. మూర్తిగారి కూతురు చదువుకున్నది. ఆమెకి యీ కట్నాలన్నా, కట్నాలు తీసుకొని పెళ్ళాడుతూవున్న పురుషులన్నా, అతి కోపం. ఎదురుగుండా తిట్టేస్తుందికూడ. 'నాకేగాని పెళ్ళి అయితే కట్నం ఎలా తీసుకుంటాడో చూస్తా!' అంటూండేది. యీ కట్నం విషయంలో మూర్తిగారు గొప్ప పథకం ఆలోచించి కూతురికి నూరి ఆయన చెప్పినట్టు చేసేటట్టు ఒప్పించేడు.

కాని ఆ అల్లుడి ఉద్దేశ్యం ఏమంటే మొదట తక్కువ కట్నానికి ఒప్పుకొని ఇంట్లో మంచం చేరేక కుసులూడదీయొచ్చు అని, నెమ్మదిగా నామాలు దిద్దొచ్చు అని అనుకొని ఒప్పేసుగున్నాడు. మూర్తిగారి కూతురంటే అతడికి మహా మురిపెం. మొదట్లో తన తండ్రి మూర్తిని అడిగితే, నాన్చి జవాబు చెప్పడంవలన యీ అల్లుడికి మూర్తిమీద కసి. సమయం దొరికితే కసి అరగదియ్యడానికి చూస్తున్నాడు.

కూతురు పుష్పవతి కాకుండానే పెళ్ళిచేయాలని మూర్తి భార్యా పట్టుబట్టింది. కాని మూర్తి కానిచ్చేడుకాడు. కాలయాపన కోరుండి చెయ్యాలనే చేసేడో లేదోగాని పైకి మాత్రం సమ్మంధాలు వెతుకుతున్నానని చెప్పేవాడు. 'తొందరేవిటే! ఇప్పుడందరూ సవర్తాడినతర్వాతే చేస్తున్నారు తప్పేం లేదని,' కూడా అంటూండేవాడు. కాని కూతురు వ్యక్తురాలవగానే యీ సంబంధానికి క్షణంలో ఒప్పేసుగున్నాడు. ఖర్చులో ఖర్చు కలుస్తుందని పెళ్ళి, కార్యం కూడ వెంటనే జరిపించేసేడు. బహుశా పెళ్ళికి కాలయాపన చెయ్యడంలో ఇదే కారణం అయివుంటుంది. చిన్నతనంలోనే చేస్తే పెళ్ళికోమారు తిరిగి కార్యానికోమారూ ఖర్చుచెయ్యాలి అని ఆలో

చించి ఇలా చేసేడు. ఎంత ప్రయత్నించినా కట్నం లేకుండా అల్లుడు దొరికేడు కాదు. అందుకే వెయ్యి రూపాయిలూ దవ్వ బిళ్ళల్లా చదివించేడు కళ్ళుమూసుకుని. ఇంకా తక్కువకి దొరుకుతారు గాని కాస్త మంచి ఉద్యోగస్థుడూ చదువుకున్నవాడు అంతకి తక్కువకి యీ రోజు దొరకడు. అలాటి సంబంధం తెస్తే తన కూతురి జీవితానికే నష్టం. కనకనే విధిలేక ఒప్పుకున్నాడు. అదీకాక లేనివాళ్ళకి చేస్తే మళ్ళా తన దగ్గరే చెయ్యి చాపుతారు.

ఈ మూర్తి ఇన్ని ఆలోచించి పెళ్ళి, కార్యం ఒక్కసారి జేస్తే అటు అల్లుడి తరపున వాళ్ళెటువంటివారయ్యా— ఇన్నాళ్ళవరకూ— ఆ అల్లుడు ఉపనయనమైనా చేసుకోలేదు. సంబంధం కలిసివస్తే అందులో ఒడుగూ పెళ్ళి ఒక్కసారే జరిపించుకోవచ్చునని, వటువు, వరుడూ ఒక్కసారే అయి కూర్చుందామని ఇంతవరకూ కాసుక్కూచున్నాడు పిల్ల కుదరగానే ఒడుగు కూడా, ఆడపెళ్ళివారే చేసుకోవాలని షరతుపెట్టి, ఒప్పుకోగానే, సమయంలో సమయం అని రెండు కార్యాలూ ఏ ఖర్చు లేకుండా చేయించుకొని, చప్పున సంసారి అయిపోయాడు.

ఈ ఒక్క నమూనాతోనే అల్లుడి సంగతి బాగా అర్థమైపోయింది. ఈత నేర్పినవాడినే నూతులో తోసినట్టుఅయిందనకున్నాడు. ఆ దెబ్బతో మూర్తిగారు ప్రతివిషయంలోనూ అతి జాగ్రత్తపడడం మొదలెట్టేడు. అయినా తోటలో దిగిన దగ్గర నుండి, ఏ నాళ్ళయే వరకూ కూడా ఏవో చిటపటలు రగులుతూనే వున్నాయి. అన్నిటికీ అతి తెలివితేటలుగా, ఉభయత్రా లాభించినట్టు సరిపుచ్చుకు వచ్చేరు మూర్తిగారు.

పెళ్ళి సమయంలో అల్లుడికి అనుకున్న ప్రకారం వెయ్యి నూట పదహార్లూ కట్నం, చదివించేశాడు గాని తిరిగి వాటిని ఎలాగయినా తీసుకోవాలని మూర్తిగారు చూస్తూనేవున్నాడు. పెళ్ళికూతురు ఇదంతా తల

వంచుకునే చూస్తూ మండిపోతూంది. కాని ఏదో ధీమాతోనే వున్నట్టుంది. మూడుముళ్ళూ కట్టటం ఆ సుముహూర్తం సవ్యంగానే జరిగిపోయింది.

పెళ్ళి మూడురోజులూ జరగకముందే మూర్తిగారు వెయ్యి రూపాయిల కట్నం తిరిగి రాబట్టేపథకం అమలుజరపడానికి సన్నాహాలు చేయటం మొదలెట్టేడు. కూతురికి చేయవలసిందంతా చెప్పి, ధైర్యం వహించమన్నాడు. ఆ తర్వాత తనకు తెలిసిన ఒక డాక్టరు దగ్గరికి పోయి కార్యక్రమం అంతా నచ్చచెప్పి అతన్ని సహాయానికి ఒప్పించేడు.

ఒకనాడు మధ్యాహ్నం అమాంతంగా పెళ్ళికూతురు మొహం తిరిగి పడిపోయింది. పెళ్ళివారందరూ గొల్లుమనిమూగేరు. గుప్పుమని పోయారు. పెళ్ళికూతురికి నోటంట మాటలేదు. మూసిన కన్ను తెరవలేదు. అంతే! మరేమీ ఇతర లక్షణాలు కనబడలేదు. మూర్తిగారు వెళ్ళి డాక్టరుగారిని తీసుకువచ్చేరు. డాక్టరు చూసి గచ్చుమన్నట్టుచూసి ఇవతలకువచ్చేశాడు. అందరూ రోదన పర్వంలోని మొదటి అంకంలోకి వచ్చారు. అంతవరకూ తిలకిస్తున్న అల్లుడుగాడు అట్టులా వేగిపోయి అలాగే నిలబడిపోయాడు. మూర్తిగారు డాక్టరుగారిని పరిస్థితి అడిగేరు. డాక్టరు అందరూ విన్నట్టే—

'ఇది చాలా విషమ జ్వరం' అని నసుగుతూ చెప్పేడు.

మూర్తిగారు 'ఎంతయినా ఖర్చుబెడతాం పిల్లనిమాత్రం బ్రతికించి ఇల్లు నిలపమని' ప్రాధేయపడ్డాడు.

"ఎలా లేదన్నా వెయ్యి రూపాయలు మనవి కాదనకుండా యీ నిముషంలో ఖర్చుబెట్టవలసి వుంటుందని విలువైన ఇంజక్షన్‌లు, మందులు వెంటనే ఇస్తే బ్రతికే ఆశ వుందని" అయన అన్నాడు.

మూర్తిగారు గాభరాపడ్డాడు.

"ఎలా తెస్తాను? ఎలాతెస్తాను? నా పిల్లనెలా బ్రతికించుకోగలను! ఎవరయినా నా పిల్లని బ్రతికించండి, మీకాజన్మాంతం చాకిరీ చేస్తాను. నా కూతుర్ని రక్షించండి. అయ్యో! నా కడుపున ఎందుకు పుట్టిందో. సమ

యానికి అంతా ఖర్చుచేసి నా పిల్లని చేతులార చంపుకుంటున్నాను. నేను బ్రతకను, నేను చస్తాను!" అని గుండె బాదుకుంటూ ఏడిచేడు.

ఇదంతా చూస్తూ అందరూ ఏక కంఠంగా ఏడవడం మొదలెట్టేరు. కొందరు పెళ్ళి పెద్దలు ఆలోచించి మూర్తిగారిని పిలిచి "కట్నంగా ఇచ్చిన వెయ్యి రూపాయలూ అవసరం నిమిత్తం అడగండి, దీన్ని గురించి పిల్లని చూస్తూ చూస్తూ చంపుకుంటారా?" అని సలహా ఇచ్చేరు. ఆలోపునే అల్లుడి తండ్రికూడా వచ్చి—

"బావగారూ డబ్బుకి విచారించకండి. ఇదిగో మీరిచ్చిన సొమ్ము. మేం మాత్రం మనుషులం కామా? కోడలు బ్రతికితే అదే కోటివేలు. ఎంత డబ్బయినా సరే ఆలోచించకుండా చికిత్స ప్రారంభించండి. మొదట మీరు ధైర్యం తెచ్చుకోండి!" అని చెప్పేడు.

అలాంటి సమయంలో ఏమన్నా బావుండదని—కట్నంగా దొరికిన డబ్బుని తిరిగి ఇచ్చి వలసి వచ్చినా, అల్లుడు సొమ్మసిల్లి పడి వున్న భార్యముఖం చూస్తూ వూరుకున్నాడు.

మూర్తిగారు, ఏడుస్తూనే ఆ వెయ్యి రూపాయలూ డాక్టరు చేతిలో పోస్తూ—

"డాక్టరుగారూ, అడిగినంత సొమ్మునీ, మీ చేతిలో పోస్తున్నాను మా పిల్లని బ్రతికించండి" అని అన్నాడు డాక్టరుగారు చికిత్స చేశారు. ఆ మర్నాటికల్లా పెళ్ళి కూతురు లేచి కూర్చుంది. పిల్లకు పత్యంలేదని డాక్టరు సర్టిఫికేటు ఇచ్చేడు, ఈ చికాకునుండి అప్పట్లో 'శోభనం' కాస్త ఎక్కడ కూడదంటాడో అని అల్లుడిగారి బెంగ, కాని అటువంటి నిర్బంధాలేవీ లేవని కార్యం యధావిధిగా జరపవచ్చునని చెప్పేసేరు.

కట్నంగా వచ్చిన ఆ వేయి రూపాయలూ తిరిగి మామగారికే ఇచ్చి వేయడంవల్ల అల్లుడిగారి మనసేం పని చెయ్యలేదు, ఈ పెళ్ళిలోనే ఏదో విధంగా మళ్ళీ లాగేయాలి! లేకపోతే గతంగతః అని చెయ్యి చిక్కించుకున్నాక మళ్ళీ ఆ వెయ్యీ, మూర్తిగారు ఇస్తాడన్న నమ్మకం ఏమిటి? అంచేత అల్లుడుగారు మరో పథకం తయారు చేశారు.

అల్లుడు తలచుకోవాలేగాని పెళ్ళిళ్ళలో అవకాశాలకే కొదవా? నాగవల్లి రానే వచ్చింది. అలకపాన్పుమీద అల్లుడు అలిగి కూర్చు న్నాడు! ఏదో అందరిలాగే చిన్న కోరిక కోరుతాడు కదా తీర్చేద్దాం అని మూర్తిగారు నాలుగు మాట్లు నసిగి ఆఖరికి కోరిక చెప్పమన్నారు.

"ఈ పెళ్ళి ఖర్చుల నిమిత్తం వెయ్యి రూపాయలు అప్పు చేశాను. వాటిని తీర్చమని" కోరాడు అల్లుడు. మూర్తిగారి గుండె గుభేలు మంది!

"అమ్మ నాయనా! వీడి దగ్గర మన ఆటలు సాగవు. ఇచ్చిన కట్నం ఏదో మిషపెట్టి తిరిగి తీసుకున్నాం కదా అని సంతోషిస్తే అందుకే తిరిగి ఈ ఎత్తు ఎత్తి వుంటాడు. తక్కువ వాడు కాడు!" అని అనుకున్నాడు. అంతసొమ్ము కోరడం అన్యాయం అని కాళ్ళా వేళ్ళా పడ్డాడుగాని...ఆ వెయ్యి రూపాయిలూ ఎలాగయినా లాగుదామన్న ఉద్దేశ్యంతో వున్న ఆ అల్లుడు వింటాడా? ఎందరు చెప్పినా, ఎంత గోల అయినా, ఎంత అసభ్యం అయినా తన పట్టు తాను వదలలేదు! కార్యం జరగనివ్వలేదు.

ఇక మూర్తిగారికి తప్పలేదు...ఆఖరికి అంత సొమ్ము లేదని బ్రతిమాలుకోగా అల్లుడు కనికరించి తనపేర వేయి రూపాయలకి నోటు రాయించుకు తీసుకున్నాడు. అప్పుడుగాని వదలలేదు.

శోభనం కూడా, ఖర్చు కలిసివస్తుందని, పెళ్ళి తర్వాత జరిపే శాడు మూర్తిగారు. మొదటరాత్రి తెల్లవారేక...తొలిరాత్రి భార్య కొంగుకి, అల్లుడు కట్టిన పెద్ద కాసు పోయిందని గుసగుసలాడుకున్నారు. ఎలా పోయిందని? అందరూ పెళ్ళికూతుర్ని అడగడం మొదలెట్టేరు. ఆమె ఏమీ జవాబు చెప్పలేదు. ఆమెకు మాత్రం ఏం తెలుసు గనుక? ప్రొద్దుటే లేవగానే ఆ కాసుని దాచమని తల్లికి ఇచ్చింది...ఆ తల్లి దాస్తానని తీసు కుని ఇప్పుడు పోయిందంటూ వెతుక్కోనారంభించింది. ఎలా పోయిందో? ఎక్కడ పోయిందో? ఎందుకు పోయిందో? ఎవరికి తెలుసు? అంచేత

ఎవరితోనూ ఏమీ అనక మాటాడకుండా వూరుకుంది. రెండో రాత్రి భర్త అడిగినా 'ఏమో!' అనేసింది.

ఇటువంటివి మచ్చుకి అందరూ చెప్పుకున్న ముచ్చటలు. ఇవిగాక ఆ పెళ్ళిలో జరిగిన వింతలు కథలకిందే దిగినాయి.

మొత్తంమీద అనుకున్న కార్యం సవ్యంగా జరిగిపోయింది. మొగ పెళ్ళివారు, ఏనాళ్ల అప్పట్లో చెయ్యం అని ఎగగొట్టారు. అంతరార్థం వాళ్ళకే తెలియాలి. వెళ్ళిన తర్వాతకూడా మరి కబురూ కాకరకాయాలేదు. ఏనాళ్ళకి వీళ్ళని పిలవాలేదు.. సరికదా, నెల-రెండు నెలలు దాటిపోతూంది, పిల్లని దిగబెట్టమని కూడా అల్లుడి తరపువాళ్ళు అనలేదు.

పెళ్ళి అయిన తర్వాతకూడా ఆడపిల్లని ఇంటివద్ద ఎన్నాళ్ళుంచుకుంటారు? ముచ్చటకయినా వారు పిలవలేదాయెను, అయినా దిగబెట్టడం మూర్తిగారి విధి. అల్లుడికి వచ్చిన కోపమేమిటంటే, పెళ్ళి అయినాక వెళ్ళిపోతున్నప్పుడయినా, తీసుకున్న వెయ్యిరూపాయల విషయం, మాటవరసకయినా మామగారు ఎత్తలేదని. పోనీ మరోనోటు అయినా వ్రాసి ఇవ్వలేదు. అలాగని అడిగేద్దామని నోటివరకూ వచ్చినా, మోమాటపడి వూరుకున్నాడు. అంచేత కోడలిని పంపమని వ్రాయలేదు.

అలక పాన్పుమీద ఎలాగూ వేయిరూపాయలకి నోటు రాసేను కదా, ఈ వెయ్యి మళ్ళీ ఎవడిస్తాడు? ఎగవేద్దాం అని మూర్తిగారి ఉద్దేశ్యం! ఒకనాడు, కూతుర్ని వెంట బెట్టుకుని అల్లుడి దగ్గరికిపోయి దిగబెట్టాడు! అల్లుడు ఆశ్చర్యపోయాడు. అయినా మర్యాదలు అతి సవ్యంగానే జరిపాడు. మాటలమీద ఆ వెయ్యిరూపాయల సంగతి ఎత్తగా "ఇంత వేగిరం పెరట్లో చెట్టు కాయదని, దులిపి జాగ్రత్తచేసి కూడి నవుడు ఇస్తానని" మూర్తి హేళనగా అంటించి వెళ్ళిపోయాడు.

అల్లుడుగారు తర్వాత పెళ్ళాన్ని పున్నమి రాత్రుల్లో అడక్కపోలేదు. "వెయ్యి రూపాయలూ మీ నాన్న ఇవ్వకపోగా ఆ వూసయినా ఎత్తలేదుకదా, నిన్ను తీసుకురావద్దంటే ఏంచేస్తాడు?" అని.

"మా నాన్న కోడ్టకే వెళదామన్నారు కాని, నేనే మర్యాదకాదని, రెండు నెలలే కదా అని వద్దన్నాను" అంది ఆయన భార్య.

"అలాగా!" అని వూరుకున్నాడు, అప్పుడేమన్నా అంటే మూడంకె వేస్తుందేమో అని!

ఇంక కొత్త కోడల్ని పరామర్శిద్దామని అమ్మలక్కలందరూ పని పడా వచ్చి పలకరిస్తున్నారు. ఆ మాటా ఈ మాటా వచ్చి—ఆమెని "సారె ఏం తెచ్చుకున్నావమ్మా!" అని అడిగేరు...అనగానే ఆమె చుట్టూ చూసింది. అత్తగారివంక వాళ్ళెవరూ లేకపోవడంబట్టి మొద లెట్టింది. "ఏదోలేండి, మా నాన్న ఏం ఇవ్వగలడు?"

"అలాక్కాదమ్మా! తృణమో, పణమో పుట్టింటిని వదిలి వచ్చేక అక్కడ వస్తువులని చూసి వారిని జ్ఞాపకం తెచ్చుకుంటాం—అవునా!" అని కంటతడి పెట్టేసింది ఒకామె.

"అవుననుకోండి...అదుగో, ఆ పందిరిమంచం మావారిచ్చిందే."

"అలాగా ఎంచక్కా వుంది! సాలి పురుగు డిజైను."

"సాలిపురుగు కాదండి, సన్‌రైజ్- అంటే ఉదయ సూర్యుడు."

"అలాగే! అలాగే!"

"అదుగోనండి—ఆ నట్టింటో వరసగా పేర్చేరే దొంతిలు... అందులో ఎనిమిది బిందెలూ, పది కూర గిన్నెలూ, డజను గరిటలూ, నాలుగు సిబ్బిలూ, రెండు పెనాలూ, మరి రెండు మూకుళ్ళూ, టీ సెట్టూ, కాఫీ ఫిల్టరూ, మూడు మరచెంబులూ, రెండు స్టయిన్‌లెస్ స్టీలు పళ్ళెలూ, ఒక కంచు కంచం..."

"—అబ్బా! అన్ని ఇచ్చేరూ? బొంబాయి బిందెల్లా వున్నాయి. చక్కా ఒక్కటే పోత. ఇక్కడ ముప్పై పుంజీల అతుకులుంటాయి."

"ఈ టేబిలూ, టీపాయి, ఈ కుర్చీలు నాలుగూ, ఈ చిన్న బీరువా, రెండు వెండికంచాలూ, టోయ్‌లెట్ పెట్టి, ఆ గోడ గడియారం, నాలుగు పట్టుచీరలూ, ఆరు ఆర్గండి చీరలూ రోజూ కట్టుకుందికి, నాలుగు వాయిల్ చీరలూ, మూడుజతల దుప్పట్లూ, రెండు టర్కీ తువ్వాళ్ళు, ఒక

వెండి సబ్బుపెట్టె, ఒక పీచుపరుపూ, బూరుగూ దూదిపరుపూ, డన్‌లప్ తలగడా, పనిచేసేప్పుడు కట్టుకుందికి రెండుజతల సాదాచీరలు, ఎక్కడి కయినా వెళితే కట్టుకుందికి ఎనభై ఏసి రూపాయలు బిన్నీ జార్జెట్ చీరలు, రెండు మూడు జతల బంగారు గాజులూ, ఒక మామిడిపిందెల నెక్లెసు, మా అమ్మతాలూకూ పొళ్ళదండ, కడియం, జుంకాలూ, నాగరం,పట్టీలూ చేతిఖర్చుకి వంద రూపాయలూ, ఇంకా ఏవో ఇలాటి చిల్లరవి ఎన్నో ఇచ్చేరండి– సమంగా జ్ఞాపకం లేవు"

"లక్షాధికారి కూతురువి! నీకేంతల్లీ, ఇలాటి సమ్మంధం దొరకడం అదృష్టం. నీకేం కొదవ? ఎన్నయినా ఇస్తారు, ఎన్నయినా తెచ్చు కుంటావు...చెప్పకుంటే మా కోడలినే చెప్పకోవాలి. ముట్టు చెంబయినా తెచ్చుకోలేదు కదా!"

"మా నాన్నకి నేనంటే ముద్దు!"

"అవునమ్మా! చూస్తున్నాం కదూ, ఎంత ముచ్చటగా కూతుర్ని అత్తారింటికి పంపేరో"

ఈవిధంగా ఆ కొత్త కోడలు సమయస్ఫూర్తిగా అత్తవారింటో వున్న సామాన్లని కూడా తన పుట్టింటివారే పెట్టినవి అని చెప్పేసరికి ఆ అమ్మలక్కలందరూ ఆనందించి వెళ్ళిపోయారు.

తర్వాత ఈ సారె సామానుల జాబితాని ఆమె అత్తగారితోముచ్చ టించారు అమ్మలక్కలందరూ.

"అదృష్టవంతురాలివమ్మా! సిరిగల కోడల్నే తెచ్చుకున్నావూ!" అని పొగిడారు. అదంతా విని ఆ అత్తగారు నోరు అలాగే వెళ్ళబెట్టినదై అప్పటికి ఏమీ అనకుండా వూరుకుంది.

ఒకనాడు కొడుకుముందు పెట్టి కోడలిని అడిగింది.

"పూచిక పుల్లయినా మీ యింటినుండి తెచ్చుకోలేదు కదా, ఉత్తి కాళ్ళూ చేతుల్తో వచ్చేవు. ఈ గొప్పలు అందరి దగ్గరా ఎందుకూ?" అని అడిగింది.

"మరి వాళ్ళలా అడిగినపుడు చెప్పకపోతే ఏపీ తెచ్చుకోలేని కోడలిని చేసుకున్నావేమిటమ్మా? అని మిమ్మల్నే దెప్పుతారుటండీ? అందుకే మీ మర్యాద నిలబెట్టడానికే అలా అన్నాను!" అని వాకచక్యంగా చెప్పింది.

ఆ ముక్కలువిని ఆ తల్లీ కొడుకులిద్దరూ ఆశ్చర్యంతో రెండో మాట అనలేకపోయినారు! ఆమె తండ్రికన్నా రెండాకులు ఎక్కువే చదివిందని అనుకున్నాడు భర్త.

తరువాత మావగారు పిలిచిందే తడవుగా ఇతను సతీసమేతంగా వెళుతూ వుండేవాడు. ఇతని ఉద్దేశ్యం ఏమిటంటే వెళ్ళినప్పుడల్లా ఏదో ఒకటి లాగవచ్చుని, కాని మొదట్లో రెండు మూడుసార్లు జరిపినా ఆ తర్వాత మూర్తిగారు పిలవడం మానుకున్నాడు. అయినా ఏదో ఒక మిష మీద వెళ్ళడం మానలేదు ఈ అల్లుడు.

మూర్తిగారు మాత్రం ఏంతక్కువ? కూతురికి కొత్తచీరలు పెట్టిన తర్వాత, పాత చీరలన్నీ బొంతలు కూరుస్తామని చెప్పి అవన్నీ వుంచేసుకుని ఆ ఒకటి రెండు కొత్తచీరలతోనే పంపడం మొదలెట్టేరు. అది కనిపెట్టి ఒక్కటే ఒక్కచీర కట్టుకున్న చీరతో భార్యని పంపేవాడు ఈ అల్లుడు భార్యని పంపవలసి వచ్చేప్పుడు అర్ధనూట పదహార్లు, తిరిగి తీసుకువచ్చేప్పుడు అర్ధనూట పదహార్లు ముడుపు కట్టాయించి మరీ పుచ్చుకొనేవాడు మూర్తిగారి అల్లుడు.

నచ్చని వస్తువు ఏదో ఆలోచించి అల్లుడికి బహుమానంగా ఇచ్చేవాడు. గోటుకొద్ది అల్లుడు ఒక్కమారు వద్దంటే చాలు, మాటాడకుండా వూరుకొని వాడేసుకొనేవాడు. ఇలా కొన్నాళ్ళ వరకూ గ్రంథం నడిచింది.

మూర్తిగారు కూతురికి నెలతప్పింది. మొదటి కాన్పు మీరోపాటి వాళ్ళయితే ఏ అయిదోనెలనో పుట్టింటికి తీసుకు వెళ్ళేవారుగాని మూర్తిగారు ఉండి ఉండి ఖర్చు తప్పుతుందికదా అని తొమ్మిదో నెలని తీసుకు

వెళ్ళాను పుట్టింటికి. అల్లుడికి తీవ్రంగా కోపంవచ్చి లోలోనే మండుతున్నాడు. పురుడు వచ్చింది. కొడుకు పుట్టాడు.

బారసాల ముచ్చట మహాదివ్యంగా జరిగింది. పదకొండో రోజునే బారసాల చేసుకోవాలని అల్లుడిగారి పట్టుదల. అయితే అదెందుకు జరగాలని మామగారు, మొత్తంమీద ఎంత ఆలస్యంచేయాలో అంత ఆలస్యం చేస్తున్నాడు. పదకొండో రోజునగాని, ఇరవైఒకటో రోజునగాని ఆఖరికి నెలకొక దినం తక్కువ చేసికూడా చేయడం మానేసి ఏమీ అనకుండా వూరుకున్నాడు.

అల్లుడుగారు ఇదంతా చూస్తూనే సమయంకోసం వేచి వున్నాడు. ఒకానొక సమయంలో మూర్తిగారు, ఏదో అర్జంటుపని తగిలి ఇంట్లో కూతుర్ని ఒక్కర్తినే వుంచి కుటుంబ సమేతంగా వెళ్ళాడు. ఆ సమయం కనిపెట్టి అల్లుడుగారు అక్కడికివెళ్ళి ముహూర్తం పెట్టించి, బాజాభజంత్రీలు పిలిపించి యథావిధిగా బారసాల జరిపించుకున్నాడు. ఇంట్లో కనపడిన డబ్బుని ఖర్చుచేసి, మిగతావాళ్ళకి మామగారి ఖాతాలో వ్రాయించేసేడు. ఈ బారసాల కోసమో మరిదేనికో మూర్తిగారు కొని వుంచిన కొత్తబట్టలన్నీ చక్కా తీసుకుని, సతీపుత్ర సమేతంగా ఇంటికి తాళం వేసేసి వచ్చేసేడు.

మరి రెండురోజులు పోయాక మూర్తిగారు వచ్చి ఇంటికి తాళం చూసి, ఇరుగు పొరుగు వారివల్ల సంగతులు గ్రహించి "హరి పిడుగు! ఎంతపని చేశాడు!" అని అనుకొని తిన్నగా అల్లుడి ఇంటికి పరుగెత్తి గోలు గోలుమంటూ తాళాలు తీసుకొని వెళ్ళిపోయాడు. అదిచూసి అల్లుడు ఎంతో ఆనందించాడు.

ఈ సంఘటన తర్వాత మూర్తిగారి కూతురికి చాలా అసహ్యం, కోపం కలిగేయి. అటు పుట్టింటారివల్లా లోపాలున్నాయి. ఇటు భర్తవల్లా లోపాలున్నాయి. ఎవరికీ మర్యాదలు తెలీవు అహంభావాలు తక్కువలేవు. ఎన్ని జరుగుతున్నా గ్రహించి, కలిసి నడుచుకుందామని ఆలోచించి

ప్రయత్నించడమే లేదు. పశ్చాత్తాపమే లేదు! ప్రతి విషయానికి కీచులాడుకొని మాటామాటా అనుకొని నలుగురు నోట్లోనూపడి పరువు మర్యాద పాడుచేసుకోవడం తప్పితే ఈ ఉభయుల మధ్యా ఎన్నటికీ సఖ్యత కుదరడంలేదు.

ఈ విషయం గురించి ఆమె తీవ్రంగా ఆలోచించడం మొదలెట్టింది ఇద్దరిమధ్యా పడకుండా ఉండడానికైనా పొత్తు కుదరడానికైనా తనవల్లనే కదా! అంచేత, ఈ జట్టీలకి కారణం తెలుసుకొని తనే ఏదోవిధంగా సామరస్యం కుదర్చాలి అని అనుకుంది.

ఆలోచించగా ఈ అనుకోడాలు తను వెళ్ళి వస్తూండడంవల్ల, పెట్టుపోతలవల్లా కదా వస్తున్నాయి అనుకుంది. రాకపోకలు మానేస్తే, పెట్టుపోతలుండవు. ఇక మరి దేనిగురించీ పోట్లాట వుండదు అని ఈ విధంగా ఆలోచించుకొని ఆమె పూర్తిగా పుట్టింటికి వెళ్ళడం మానుకుంది. ఇలా చేసినందువల్లయినా తన ప్రయత్నం ఫలించేట్టు చేయమని భగవంతుణ్ని ప్రార్థించేది, ఎప్పటికి సవ్యంగావుంటే అప్పుడే మళ్ళీ వెళ్ళవచ్చు అని మనసు కట్టుకుంది.

అదృష్టవశాత్తూ ఆమె ఆలోచన ఫలిస్తూ వచ్చింది కొన్నాళ్ళకి. ఎందుకంటే ఇటు పుట్టింటారికీ, అటు భర్తకీ, మొండితనాలూ, స్వప్రయోజనాభిలాషలూ, గర్వాలు తప్పిస్తే మరొకటి లేదు. అభిమానాలు మాత్రం ఎక్కడికి పోతాయి.

ఆమె పుట్టింటికి వెళ్ళడం మానేసరికి వచ్చే ఆమాత్రం అయినా రాకుండా పోవడంచేత, ఆమె భర్తకి చాలా బాధకలిగింది. రోజూ ఆమెని వెళ్ళమని వెళ్ళి ఏదోఒకటి తెమ్మని పోరేవాడు. ససేమిరా ఆమె వెళ్ళనని చెప్పేసింది. ఒక్క చీరకూడా పుట్టింటినుండి తెచ్చుకోడంలేదని విచారించేవాడు భర్త. అయినా విననట్టు వూరుకునేది. ఏం జవాబు చెప్పకుండా కొన్నాళ్ళు వూరుకుంది.

ఆమె ఇలా అకస్మాత్తుగా మారిపోడానికి కారణం అతనికి బోధపడలేదు. ఆఖరికి వుండబట్టలేక అడిగేడు.

ఆమె చెప్పింది.

"అనువు కదా అని, మామగార్లని చీటికి మాటికి పీడించే గుణం పోవాలనీ, ఏదో కలిగింది సంతోషంగా యిస్తే పుచ్చుకొనే ఆచారాన్ని దుర్వినియోగం చేసి, రాబట్టడమే ముఖ్యసూత్రంగా పెట్టుకొనే బుద్ధిపోవాలని, సంసారులు ఎంతకని ఇవ్వగలరని? ఎవరి హద్దులలో వారు వుండి సంతోషంగా ఇచ్చిన దానితోనే తృప్తిపడి, ఇచ్చినా ఇవ్వకపోయినా, ఏమీ అనుకోకుండా వుంటేనే ఇహ మీదిట మావాళ్ళింటికి వెళ్ళేది! లేకపోతే లేదు!" అని ఖచ్చితంగా చెప్పేసింది.

ఆమె మాటలు వున్నాడు. ఎన్ని విధాల ప్రయత్నించినా ఆమె పట్టుదల వదలక పోవడంచేత, ఆమె నిశ్చయం ఆ విధంగా తెలిపిన తర్వాత, ఇక లాభం లేదనుకున్నాడో లేక, రాబోయే పురిటికూడా వెళ్ళకపోతే ఆ ఖర్చు తప్పదనుకున్నాడో-ఏమీలేని దానికన్నా, వాళ్ళిచ్చిన తృణమో పణమో అదే దక్కుడు అని భావించాడో ఏమోగాని... ఆమెతో రాజీకి వచ్చాడు.

"తనేమీ అనననీ, ఆమె పుట్టింటి నుండి ఏం తెచ్చుకుంటే అదే పదివేలని, తనేం కలగజేసుకోనని" ఒప్పేసుకున్నాడు.

ఇంక ఆమె తల్లిదండ్రులు కూడా, ఎంతలాటివారయినా, అభిమానం చంపుకోలేకపోయారు. మొదట్లో మూర్తిగారికి డబ్బుఖర్చు తప్పితే బాగానే వుందనిపించినా కూతుర్ని చూడాలని అనిపించకపోలేదు! ఒకటి రెండేళ్ళ పాటు కూతుర్ని తీసుకురాకపోయేసరికి, లోకం బాధ లావయిపోయింది. ప్రతివాళ్ళూ కూతుర్ని ఎందుకు తీసుకురాలేదని పరామర్శించడమే! అది అలా వుంచి ఇంట్లో అతని భార్య అస్తమానూ వేపుకుతినడం మొదలెట్టింది-ఎలాగో ఒకలాగ కూతుర్ని తీసుకురమ్మని, డబ్బుకోసం కూతుర్ని వదులుకుంటామా అని!

ఇంత ఆలస్యం అయేక అల్లుడికోపం వచ్చి వుంటుందని, తీరా పిలిస్తే ఎంత వదలకొడతాడో అనీ, మూర్తి గారికి భయం కలిగినా, ఒక

వైపు అభిమానం, ప్రేమ, మరో వైపు లోకం, బాధ యింట్లో భార్య పోరూ పడలేక వుత్తరం వ్రాసేడు...ఎన్ని వుత్తరాలు వ్రాసినా జవాబు రాకపోడం చూసి, అతనే విధిలేక అల్లుని యింటికి ప్రయాణమయ్యాడు.

వెళ్ళగానే కూతురూ, అల్లుడూ, మర్యాదగానే చూశాక నిబ్బర పడ్డాడు. తాపీగా ఆ విషయం ఎత్తేడు. "నాకేం అభ్యంతరం లేదండి! తీసుకు వెళ్ళండి!" అని అల్లుడన్నాడు. ఆ మాట విని అంత సుళువుగా అన్నందుకు ఆశ్చర్యపోయాడు. అయినా, అల్లుడు అభ్యంతర పెట్టడని తనకి తెలుసు. ఎందుకంటే, అల్లుడికి ఆశ ఎక్కువ. ఏదో ఒకటి తన నుండి రాబట్టకండా యిలా మొండితనం చేసి భార్యను పంపడం మానతా డంటే తను నమ్మలేదు. దీని అంతటికీ కారణం వేరే ఏదో...వుంది అని భావించాడు.

కూతుర్ని కూడా రమ్మని అడిగేడు.

"నాన్నగారూ! ఇలా ఎక్క డివాళ్ళు అక్కడి హాయిగా వుంటే చాలదా? అక్కడికి రావడం గొడవలు జరగడం ఎందుకు! యిలా చల్లగా వెళ్ళనిద్దురూ!" అంది.

"అదేమిటమ్మా అలాగంటావు, ఆడపిల్లవి నువ్వు రాకపోతే ఎలా, మీ అమ్మ చూడాలని అంటూంది!" అని అన్నాడు.

"నాకూ వుంది నాన్నా! కాని, ఏం లాభం? మీకూ మీ అల్లుడికీ డబ్బంటే వున్న అభిమానం మరి వేటిమీదా లేదు. అతను కాణీకి ఆశ పడితే—మీరు ఆ కాణి కొట్టాడితేనేగాని యివ్వరు. ఇద్దరి మధ్య మామగారూ అల్లుడూ ఈ గౌరవ మర్యాదలు లేవు! తాహతుకి తగ్గ కోరిక అతను కోరడు-మీరు అతనిని నీచంగా చూడడం మానరు. ఈ విషయాల్లో మీరిద్దరూ మారితేనే గాని నేను ఎక్కడికి కదలను, ఏదో పెంచి పెద్ద చేసి లోటులేని యింట్లో పడేశారు. మీ బాధ్యత మీరు నెరవేర్చుకున్నారు" అని నిష్ఠూరంగా మాటాడింది.

అల్లుడూ మావ లిద్దరూ ఒకరి మొహం ఒకరు చూచుకున్నారు ఆఖరికి ఆలోచించుకొని మూర్తిగారు, "ఎంతమాటన్నావమ్మా! ఏదో

అల్లుడు ఇలా అన్నిటితో తగువులాడుతుంటే, కూడదని చెప్పడానికే అలా చేశానుగాని, నీమీద, అతని మీదా గౌరవం, ప్రేమా లేకనా... నీకు నెలతప్పింది కదా, ఎలానూ అక్కడికే రావాలి! ఇప్పుడు నాతోనే బయలుదేరండి! మరి కాదనక!" అని తిరిగి అన్నాడు.

ఆ మాట ఆమె విని—

"ఇద్దరూ ఎవరి హద్దులో వారు వుండి మర్యాదగా, గౌరవంగా ప్రవర్తిస్తారంటేనే, అలాగని ఒప్పుకుంటేనే నే వస్తాను" అని అంది. మళ్ళీ ఇంకా సంశయం తీరక.

"అలాగే అనవోయ్ అల్లుడూ నన్ను చంపక" అని నవ్వుతూ అన్నాడు మూర్తి.

"మీ యిష్టం! నే నెప్పుడు కాదన్నాను?" అని అల్లుడు లౌక్యంగా అన్నాడు.

మొహం ముందు అనుకోడం ఇద్దరికీ ఎప్పుడూ అలవాటు లేదుగా ఆ విధంగా అల్లుడు మావ లిద్దరూ రాజీ పడ్డారు.

ఈ విధంగా తండ్రినీ, భర్తనీ ఒప్పించి, సంతోషంగా తండ్రి పుట్టింటికి వెళ్ళింది ఆమె.

అప్పటినుండి వారిలో పరివర్తన వచ్చి, అహంభావం, సాపోయి, మనిషిని మనిషి గౌరవించుకోడం నేర్చుకున్నారు.

—డం